సాక్షి కామారెడ్డి
గురువారం । 21 । నవంబర్ । 2024



అంగన్‌వాడీలను పర్యవేక్షించాలి

సీడీపీవోలు అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, పిల్లల హాజరును పర్యవేక్షించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు.

- 8లో ▸



ప్రభుత్వం ఆదుకోవాలి

ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణంతో నష్టపోయిన తమను ఆదుకోవాలని ఆటో డ్రైవర్లు ప్రభుత్వాన్ని కోరారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.5 /11.7

ఉదయం చలిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

రేపు జాబ్ మేళా

కామారెడ్డి క్రైం: కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డిలోని స్టాఫింగ్ టైటాన్స్ ప్రైవేట్ లిమిటెడ్, కేఎల్ గ్రూప్ కంపనీలలో పలు ఉద్యోగాల భర్తీ కోసం ఈ మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ చదివిన 18 నుంచి 30 ఏళ్ల లోపువారు అర్హులని తెలిపారు. ఆసక్తి గలవారు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు బయోడేటా, సర్టిఫికెట్‌లతో కలెక్టరేట్‌కు రావాలని, ఇతర వివరాలకు 76719 74009, 63039 32430, 77308 20444 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మున్నూరుకాపు సంఘం 'సీనియర్' జిల్లా అధ్యక్షుడిగా గంగయ్య



కామారెడ్డి రూరల్: జిల్లా మున్నూరుకాపు సంఘం సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడిగా కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన అన్నాల గంగయ్య నియమితులయ్యారు. ఈ విషయాన్ని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య, కామారెడ్డి జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి చదల సత్యనారాయణ తెలిపారు. నీలం నర్సింలును జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించామని పేర్కొన్నారు.

'జిల్లాలోనే పెద్ద గ్రంథాలయం'



కామారెడ్డి అర్బన్: రిఫరెన్స్ పుస్తకాలను పరిగణనలోకి తీసుకుంటే జిల్లాలోనే పెద్ద గ్రంథాలయంగా కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గ్రంథాలయం నిలుస్తుందని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిష్టయ్య పేర్కొన్నారు. కళాశాలలో బుధవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పూర్తి స్థాయిలో గ్రంథాలయాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల గ్రంథపాలకుడు లక్ష్మణాచారి, అధ్యాపకులు ఆకుల సుధాకర్, విశ్వప్రసాద్, జి.శ్రీనివాస్‌రావు, దినకర్, అంకం జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకున్న డాక్యుమెంట్ రైటర్ల దుకాణాలు



సుభాష్‌నగర్: నిజామాబాద్ అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయ దస్తావేజు లేఖర్ల దుకాణాలు బుధవారం తెరుచుకున్నాయి. సబ్ రిజిస్ట్రార్ ఇబ్బంది పెడుతున్నారంటూ 9 రోజులుగా దుకాణాలు మూసి ఉంచారు. దీంతో రిజిస్ట్రేషన్లు మందకొడిగా సాగాయి. అయితే సబ్ రిజిస్ట్రార్ నాలుగు రోజులు సెలవులో వెళ్లారు. ఇన్‌చార్జిగా చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. దస్తావేజు లేఖర్లు పెండింగ్‌లో ఉన్న డాక్యుమెంట్లకు రిజిస్ట్రేషన్ చేయించారు. బుధవారం ఒక్కరోజే 40 వరకు సేల్ డీడ్, గిఫ్ట్ డీడ్, మార్ట్‌గేజ్, తదితర డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిసింది. చాలా రోజుల తర్వాత రిజిస్ట్రేషన్ కార్యాలయం ప్రజలు, డాక్యుమెంట్ రైటర్లతో సందడిగా మారింది.

జాతీయస్థాయి పోటీలకు దేవునిపల్లి విద్యార్థులు



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రోల్ ప్లే కాంపిటీషన్–2024(పాపులేషన్ ఎడ్యుకేషన్ సెల్ అంశం)లో పాల్గొన్నారు. ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ రమేష్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం గంగాకిషన్, గైడ్ టీచర్ భవాని, ఉపాధ్యాయ బృందాన్ని డీఈవో రాజు అభినందించారు. విద్యార్థులతో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి వేణు శర్మ ఉన్నారు.



అర్గొండ-కొండాపూర్ మధ్య ప్రమాదకరమైన మూలమలుపు

అవస్థల ప్రయాణం

అర్గొండ – కొండాపూర్ దారిలో ప్రయాణమంటే అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని వెళ్లడమే.. ఓవైపు గుంతలు, మరోవైపు ప్రమాదకరమైన మూల మలుపులతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితి. దశాబ్దాలుగా ఈ మార్గం అభివృద్ధికి నోచుకోకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు.

- రోడ్డు విస్తరణకు అటవీ అనుమతుల గ్రహణం
- మూల మలుపులు, గుంతలతో ప్రమాదాలు
- దశాబ్దాలుగా ఇబ్బందిపడుతున్న ప్రజలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కామారెడ్డి జిల్లా కేంద్రం నుంచి రాజంపేట మండల కేంద్రం మీదుగా మెదక్ జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రధానంగా రాజంపేట మండలం అర్గొండ నుంచి కొండాపూర్ గ్రామం వరకు ఉన్న అటవీ ప్రాంతంలో రోడ్డు అధ్వానంగా తయారయ్యింది. పెద్దపెద్ద గుంతలు ఏర్పడి నిత్యం ఏదో ఒక వాహనం అదుపుతప్పి పడిపోతోంది. రాజంపేట మండలంలోని అర్గొండ, కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి, బస్వన్నపల్లి, గుండారం గ్రామాల నుంచే కాకుండా అనేక తండాలు ఈ రోడ్డుపై ఉంటాయి. అలాగే మెదక్ జిల్లాలోని వాడి, బూరుగుపల్లి, తదితర గ్రామాల నుంచి నిత్యం కామారెడ్డి పట్టణానికి వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. కూరగాయలు పండించిన రైతులు, అలాగే నిర్మాణరంగంలో పనిచేసే కూలీలు చాలా మంది నిత్యం బైక్‌లు, ఆటోలలో వచ్చిపోతుంటారు. అలాగే బస్సు సర్వీసులూ నడుస్తుంటాయి.



కామారెడ్డి-మెదక్ రహదారిపై అర్గొండ -కొండాపూర్ మధ్య ప్రమాదకరంగా ఉన్న గుంతలు

భారీ గుంతలు..

అర్గొండ -కొండాపూర్ గ్రామాల మధ్య రోడ్డు రెండు వరుసలుగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఉన్న రోడ్డు కూడా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. కొన్నిచోట్ల పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ద్విచక్ర వాహనం కానీ, ఆటోలు కానీ కొంత వేగంగా వెళ్తే బోల్తా పడే ప్రమాదం ఉంది. అలాగే ఎదురుగా బస్సులు, లారీలు వచ్చినపుడు రోడ్డు దింపితే పడిపోయి గాయాల పాలవుతున్నారు. కొండాపూర్ నుంచి మెదక్ జిల్లా సరిహద్దు వరకు కూడా రెండు వరుసల రోడ్డుగా అభివృద్ధి చేసినా.. ఆ రోడ్డుపైనా అక్కడక్కడ గుంతలు ఏర్పడ్డాయి. గుంతలను పూడ్చాల్సిన రోడ్లు భవనాల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

మలుపుల్లో పొంచి ఉన్న ప్రమాదం

అర్గొండ-కొండాపూర్ గ్రామాల మధ్య సుమారు 5 కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతం ఉంది. ఈ ప్రాంతంలోని ఘాట్ సెక్షన్‌లో ఉన్న మూలమలుపులు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. మూల మలుపుల వద్ద గో స్లో అన్న బోర్డులు తప్ప తగిన రక్షణ ఏర్పాట్లు చేయలేదు. ఒక్కోసారి వాహనాలు రోడ్డు దిగిపోయి పడిపోతున్నాయి. గతంలో ఓ ఆటో బోల్తాపడిన ఘటనలో పలువురు మృతిచెందారు. ఈ మార్గంలోని మూల మలుపుల వద్ద పడిపోయి ద్విచక్ర వాహనదారులు పలువురు గాయాల పాలయ్యారు. లోడ్‌తో ఉండే ట్రాక్టర్లు, లారీలు మూల మలుపుల వద్ద ఘాట్ సెక్షన్ ఎక్కలేక ప్రమాదాలకు గురవుతున్నాయి.

అనుమతులు లభించక..

డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు గతంలోనే నిధులు మంజూరయ్యాయి. అటవీ సరిహద్దు వరకు రెండు వరుసలుగా రోడ్డును డెవలప్ చేశారు. కానీ అటవీశాఖ అనుమతులు దొరక్కపోవడంతో 5 కిలోమీటర్ల మేర పనులు నిలిచిపోయాయి. రహదారి విస్తరణ విషయమై ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు 'సాక్షి'తో మాట్లాడుతూ సమస్య పరిష్కారం కోసం అటవీశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నానన్నారు. త్వరలోనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

గుంతలు పూడ్చాలి



అంతర్ జిల్లా రహదారిపై ఏర్పడిన గుంతలతో ఇబ్బంది పడుతున్నాం. ఈ దారిలో ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. గుంతలను పూడిస్తే సమస్య కొంత వరకు తగ్గుతుంది. అధికారులు సమస్యను పరిష్కరించాలి.

– సయ్యద్ మీర్, వాహనదారుడు, అర్గొండ

పనులు పూర్తి చేయాలి



కామారెడ్డి నుంచి మెదక్ వరకు డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేసే పనులు మధ్యలో నిలిచిపోయాయి. ముఖ్యంగా అడవి లో సింగిల్ రోడ్డు ఉంది. మూలమలుపులు, గుంతలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. త్వరగా పనులు పూర్తి చేయాలి.

– రాజేందర్, వాహనదారుడు, కొండాపూర్

కాలభైరవుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రామారెడ్డి : ఇసన్నపల్లి(రామారెడ్డి)లో వెలసిన శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో కార్తీక బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామి వారి జన్మదినోత్సవాలలో భాగంగా ఉదయం గణపతి పూజ నిర్వహించి సంతత ధారాభిషేకం మొదలుపెట్టారు. ఈ కార్యక్రమం నిరంతరాయంగా 72 గంటల పాటు కొనసాగనుంది. ఉత్సవాలలో భాగంగా గురువారం బద్ది పోచమ్మకు బోనాలు సమర్పిస్తారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ ఈవో ప్రభు గుప్తా తెలిపారు.



సంస్కృతి పరిరక్షకులు మహిళలే



మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ వెంకట శివకుమార్

- ఆర్‌ఎస్‌ఎస్ ఇందూర్ విభాగ్ ప్రచారక్ వెంకట శివకుమార్
- సౌత్ క్యాంపస్‌లో ఘనంగా స్త్రీ శక్తి దివస్

భిక్కనూరు : మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటుతోంది మహిళలేనని ఆర్‌ఎస్‌ఎస్ ఇందూర్ విభాగ్ ప్రచారక్ వెంకట శివకుమార్ పేర్కొన్నారు. ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా బుధవారం భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో స్త్రీశక్తి దివస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సనాతన కాలం నుంచి మన దేశంలో స్త్రీల గౌరవ మర్యాదలకు ప్రాధాన్యత ఉందన్నారు. స్త్రీని తల్లిగా చెల్లిగా భావించాలన్నారు. రెండు వందల ఏళ్ల క్రితమే ఝాన్సీ లక్ష్మీబాయిలాంటి ఎందరో త్యాగధనులు, దేశభక్తులు దేశం కోసం పోరాడారన్నారు. వారి బాటలో నడవాలని పిలుపునిచ్చారు. దేశచరిత్ర కొందరి వల్ల మరుగున పడిందని, దానిని వెలుగులోకి తేవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. యువత దేశ పునర్నిర్మాణంలో భాగస్వాములై ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ లలిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు ప్రతిజ్ఞ, హరిత, కవిత, మోమన్‌బీబు, నారాయణ, వీరభద్రం, వైశాలి, యాలాద్రి, సరిత, నర్సయ్య, కనకన్న, ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు వంగ రాహుల్, చెన్నప్పగారి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా



గ్రంథాలయంలో చదివి ఉద్యోగాలు పొందిన వారితో షబ్బీర్‌అలీ, చంద్రకాంత్‌రెడ్డి, ఆశిష్ సంగ్వాన్

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

కామారెడ్డి అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయానికి అధునాతన సౌకర్యాలతో కూడిన అదనపు భవనం మండలాల్లో పక్కా భవనాలు నిర్మించే విషయమై ముఖ్యమంత్రితో మాట్లాడతానని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభను బుధవారం కామారెడ్డిలోని జిల్లా గ్రంథాలయ సంస్థలో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా షబ్బీర్ అలీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చాక 51 వేల ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. షబ్బీర్‌అలీ ఫౌండేషన్, ఇతర దాతల సహకారంతో గ్రంథాలయాల్లో వసతులు కల్పిస్తామన్నారు. గ్రంథాలయాలను వినియోగించుకుని ఉద్యోగాలు పొందిన అభ్యర్థులను స్ఫూర్తిగా తీసుకోవాలని నిరుద్యోగులకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి సూచించారు. కోరిన వెంటనే అవసరమైన రిఫరెన్స్ పుస్తకాలు అందుబాటులో ఉంచడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. గ్రంథాలయంలో చదివి ఉద్యోగాలు సాధించిన పలువురిని సన్మానించారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో రంగనాథ్‌రావు, డీఎస్పీ నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఉర్దొండ వనిత, కౌన్సిలర్ ఎం.ప్రసూన, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

లింగంపేట(ఎల్లారెడ్డి): ముస్తాపూర్, కన్నాపూర్, పొల్కంపేట, మాలోత్ సంగ్యానాయక్‌తండా, భవానీపేట గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఐకేపీ డీపీఎం రమేశ్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు వివరాలను వెంటవెంటనే ట్యాబ్‌లో నమోదు చేయాలని నిర్వాహకులకు సూచించారు. డబ్బులు రైతుల ఖాతాల్లో తొందరగా జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు. తేమ శాతం 17 లోపు ఉన్న వడ్లను మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏపీఎం శ్రీనివాస్, సీసీలు, వీవోలు ఉన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఎం

ట్రెజరీలో అక్రమ వసూళ్లు!

- పెన్షన్ ప్రపోజల్స్‌కు ధర కడుతున్న అధికారులు
- చర్యలు తీసుకోవాలని టీపీటీఎఫ్ డిమాండ్



ట్రెజరీ అధికారికి ఫిర్యాదు చేస్తున్న టీపీటీఎఫ్ నేతలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ఉద్యోగులు పనికో రేటు నిర్ణయించి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెన్షన్ ప్రపోజల్స్ పంపడానికి, కొత్తగా నియామకమైన ఉపాధ్యాయులకు ట్రెజరీ ఐడీ కేటాయించడానికి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని టీపీటీఎఫ్ నేతలు ఆరోపిస్తున్నారు. బుధవారం టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అనిల్‌కుమార్, సీహెచ్ లింగం, జిల్లా ఉపాధ్యక్షురాలు నళినిదేవి, ఫెడరేషన్ సలహాదారు పి.అంజయ్యలు ట్రెజరీ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లును కలిశారు. జిల్లా ట్రెజరీ కార్యాలయంలో జరుగుతున్న అక్రమ వసూళ్ల వ్యవహారంపై ఫిర్యాదు చేశారు. డబ్బులు ఇస్తేనే ఫైల్ ముందుకు కదులుతోందని పేర్కొన్నారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యాలయంలో అక్రమ వసూళ్లను నిలువరించకపోతే ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

- కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్
- జిల్లా ఆస్పత్రి తనిఖీ



వైద్యాధికారితో మాట్లాడుతున్న కేవీఆర్

కామారెడ్డి టౌన్: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన జీజీహెచ్‌ను తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. రోగులు చెప్పిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, మెరుగైన సేవలు అందించాలని వైద్యాధికారికి సూచించారు. అనంతరం ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఫరీదాతో మాట్లాడారు. ఆస్పత్రిలోని సమస్యలను తెలుసుకున్నారు.

మహాత్మా.. మన్నించు!



గాంధీ విగ్రహం ముందు నిర్లక్ష్యంగా వదిలేసిన గుంత



అసంపూర్తిగా ఉన్న మార్కెట్ భవన నిర్మాణం



మురికి కూపంగా మారిన పరిసరాలు

- మురికి కూపంలా తయారైన జిల్లాకేంద్రంలోని గాంధీ గంజ్
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..
- పట్టించుకోని పాలకులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాకేంద్రంలోని గాంధీ గంజ్ మురికి కూపంలా మారిపోయింది. ఆపై అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా అయ్యింది. గతంలో గొప్ప పేరున్న గాంధీ గంజ్.. పాలకులు పట్టించుకోకపోవడంతో నానాటికీ తీసికట్టుగా తయారవుతోంది. రైతుల పండించిన పంటలను కొనుగోలు చేయడానికి గంజ్ మార్కెట్‌ను నిర్మించారు. దానికి గాంధీ పేరు పెట్టారు. ఈ గంజ్ ఉమ్మడి రాష్ట్రంలోనే ఖ్యాతికెక్కింది. అప్పట్లో బెల్లం వ్యాపారంలో కామారెడ్డి గాంధీ గంజ్‌కు ఎంతో పేరుండేది. ఇక్కడి నుంచి గుజరాత్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు బెల్లం తరలివెళ్లేది. బెల్లం రైతుపై కక్ష గట్టిన నాటి చంద్రబాబు సర్కారు.. నల్లబెల్లం పేరుతో ఆంక్షలు విధించి బెల్లం వ్యాపారాన్ని దెబ్బతీసింది. వైఎస్సార్ ముఖ్యమంత్రి అయ్యాక బెల్లంపై ఆంక్షలు ఎత్తివేయడంతో ఆయన కాలంలో మరోసారి ఓ వెలుగు వెలిగింది. కానీ తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత పరిస్థితి మారిపోయింది. ఇక్కడ తయారు చేసే నల్లబెల్లం గుడుంబాకు వెళ్తోందంటూ పాలకులు బెల్లంపై ఆంక్షలు విధించారు. తయారు చేయకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో బెల్లం దందా బంద్దైంది. అప్పటి నుంచి గంజ్ ఉనికి కోల్పోయింది. మక్కలు, వడ్ల దందా నడుస్తుండగా.. కూరగాయలు, మటన్, ఫిష్ మార్కెట్ కోసం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించడం కోసం గంజ్‌లోని షెడ్లన్నింటినీ తొలగించారు. కొత్త మార్కెట్ కోసం పనులు మొదలుపెట్టినా.. నిధుల సమస్యతో అదీ మధ్యలోనే నిలిచిపోయింది. క్రమంగా గంజ్ ప్రాభవం కోల్పోయింది. ప్రస్తుతం గంజ్ అస్తిత్వాన్ని కోల్పోయింది. అక్కడి పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. ఎక్కడ పడితే అక్కడ మూత్ర విసర్జన చేస్తున్నారు. ఎక్కడెక్కడి నుంచో చెత్త తెచ్చి పడేస్తుండడంతో మురికి కూపంగా మారింది. గంజ్ తమది కాదన్నట్లుగా మార్కెట్ కమిటీ వ్యవహరిస్తుండడంతో పరిస్థితి మరీ దారుణంగా తయారయ్యింది. పట్టించుకునేవారు లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. చీకటి పడితే చాలు గంజ్‌లోని అసంపూర్తిగా మిగిలిన ఇంటిగ్రెటెడ్ మార్కెట్‌లో విచ్చలవిడిగా మద్యం తాగుతున్నారు. వ్యభిచారానికి సైతం ఈ ప్రాంతం అడ్డాగా తయారయ్యింది. పాలకులు పట్టించుకుని గాంధీ గంజ్‌కు పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

పేదలకు డిజిటల్ హెల్త్ కార్డులు అందజేస్తాం



కామారెడ్డి టౌన్: సమగ్ర సర్వే పూర్తయిన అనంతరం అర్హులైన నిరుపేదలకు డిజిటల్ హెల్త్ కార్డులను అందించి రూ.10 లక్షల వరకు నిమ్స్ ఆస్పత్రిలో ఉచిత వైద్యం అందిస్తామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 76 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందన్నారు.

కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): రైతులు వరి ధాన్యాన్ని ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని సింగిల్ విండో చైర్మన్, డీసీఎంఎస్ డైరెక్టర్ నల్లవెల్లి కపిల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఎర్రాపహాడ్‌లో కొనసాగుతున్న వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాలలో అన్నిరకాల వసతులను కల్పించాలని సిబ్బందిని హెచ్చరించారు.

ఏరియా ఆస్పత్రిని సందర్శించిన విద్యార్థులు



బాన్సువాడ రూరల్: కొత్తబాది గ్రామానికి చెందిన మోడల్‌స్కూల్ ఒకేషనల్ విద్యార్థులు బుధవారం బాన్సువాడలోని మాతాశిశు ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. ఉపాధ్యాయులు లక్ష్మణ్‌సింగ్, సుజాత ఆధ్వర్యంలో విద్యార్థులు ఆరోగ్య పరిరక్షణ, అంటువ్యాధులు, ప్రాథమిక చికిత్స తదితర అంశాల గురించి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో వినియోగించే వివిధ రకాల పరికరాలు, వస్తువుల గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేశారు.

పోక్సో కేసు నమోదు

దోమకొండ: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి గర్భవతిని చేసిన బీబీపేట మండలంలోని జనగామకు చెందిన యువకుడిపై పోలీసులు బుధవారం పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. కామారెడ్డి డీఎస్పీ ఆధ్వర్యంలో విచారణ చేపట్టి యువకుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

కొనుగోలు కేంద్రాలకు కమీషన్ కష్టాలు

- 2022 – 23 సంవత్సరానికి సంబంధించి రూ.35 కోట్ల బకాయిలు
- తేలని మరో రెండు సీజన్‌ల లెక్కలు
- కమీషన్ అందక ఇబ్బందులు



మోర్తాడ్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లు

మోర్తాడ్(బాల్కొండ): ధాన్యం కొనుగోలు కేంద్రాలను కమీషన్ కష్టాలు వెంటాడుతున్నాయి. కొనుగోలు చేసిన ధాన్యానికి కమీషన్ చెల్లించడంలో జాప్యం కారణంగా కేంద్రాల నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరలోని రెండు సీజన్‌ల కమీషన్ రూ.35,03,76,708 జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు జమ కావాల్సి ఉంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రెండు సీజన్‌ల ధాన్యం సేకరించినప్పటికీ గన్నీ సంచుల స్వాధీనం, లెక్కలు చేయకపోవడంతో కమీషన్ ఎంతో ఇంకా తేలలేదు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే గడిచిన రెండు సీజన్‌లలోనూ రూ.35 కోట్లకు పైగానే కమీషన్ జమ కావాల్సి ఉంటుందని తెలుస్తోంది. వర్షాకాలం, యాసంగి సీజన్‌లలో ధాన్యం కొనుగోళ్లు జోరుగానే సాగుతున్నాయి. జిల్లాలోని అన్ని సహకార సంఘాలతోపాటు, మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలోనూ ధాన్యం కొనుగోళ్లు సాగుతున్నాయి. దొడ్డు రకాలను గతంలో ఎక్కువగా కొనుగోలు చేయగా, కొన్ని సందర్భాల్లో సన్న రకాలను కూడా కొనుగోలు చేశారు. ఈ సీజన్‌లో మాత్రం సన్న రకాలకు రాష్ట్ర ప్రభుత్వం బోనస్‌ను ప్రకటించడంతో సన్న రకాల కొనుగోళ్లలో వేగం పుంజుకుంది. ఒక్కో క్వింటాలుకు రూ.32 వరకు కమీషన్ చెల్లిస్తున్నారు. ఈ లెక్కన ధాన్యం సేకరణను బట్టి కొనుగోలు కేంద్రాలను నిర్వహించిన సహకార సంఘాలు, మహిళా సమాఖ్యలకు భారీ మొత్తంలోనే కమీషన్ రూపంలో ఆదాయం సమకూరుతుంది. ఇది ఇలా ఉండగా సహకార సంఘాలకు కొనుగోళ్ల కమీషనే ప్రధాన ఆదాయ వనరుగా మారింది. ఎరువుల వ్యాపారం అంతంత మాత్రంగానే సాగుతుండటంతో ధాన్యం సేకరణ ద్వారా లభించే కమీషన్ సంఘాల నిర్వహణకు ప్రధానమైంది. ఈ నేపథ్యంలో కమీషన్ చెల్లించకపోవడంతో అనేక సహకార సంఘాలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. గత ప్రభుత్వం పౌర సరఫరాల సంస్థకు కొనుగోళ్ల కమీషన్‌కు సంబంధించిన నిధులను విడుదల చేయకపోవడంతో సహకార సంఘాల్లో కాసుల కొరత తీవ్రమైంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యం సేకరణ కమీషన్ సొమ్ము జమ చేయాలని పలువురు సూచిస్తున్నారు.

నిధులు విడుదల కావాల్సి ఉంది

కొనుగోలు కేంద్రాలకు కమీషన్‌కు సంబంధించి నిధులు విడుదల కావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే కొనుగోలు కేంద్రాలకు వారివారి కమీషన్ డబ్బులు చెల్లిస్తాం. కొనుగోళ్లు పూర్తి చేసిన వెంటనే గన్నీ సంచులు అప్పగించి లెక్కల వివరాలను అందించాలి. అన్ని కొనుగోలు కేంద్రాల లెక్కలు అందితేనే కమీషన్ సొమ్ము ఎంత అనేది ప్రభుత్వానికి నివేదించడానికి వీలవుతుంది.

– అంబదాస్ రాజేశ్వర్, పౌర సరఫరాల సంస్థ మేనేజర్

అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించాలి

- పిల్లలకు పౌష్టికాహారం అందేలా చూడాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: సీడీపీవోలు క్షేత్ర స్థాయిలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, పిల్లల హాజరును పర్యవేక్షించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పిల్లల ఆరోగ్య స్థితిగతులను పరిశీలించి అవసరమైతే న్యూట్రిషియన్ కేంద్రాలకు పంపించాలని సూచించారు. పిల్లలకు బాలామృతం, పాలు, గుడ్లు ఇతర పౌష్టికాహారం అందించాలన్నారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులను పరిశీలించాలని అధికారులకు సూచించారు. నిర్మాణంలో ఉన్న వాటిని వేగంగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలన్నారు. కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. వారందరికీ బయోమెట్రిక్ హాజరు అమలు చేయాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి చందర్ నాయక్, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, పంచాయతీరాజ్ ఈఈలు దుర్గాప్రసాద్, ఆంజనేయులు, డీఈఈలు, సీడీపీవోలు, సూపర్‌వైజర్‌లు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ వైస్ చైర్మన్ శంకర్



కొండాపూర్‌లో టీకాలు వేస్తున్న వైద్యులు

బిచ్కుంద(జుక్కల్): ఖద్గాంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏఎంసీ వైస్ చైర్మన్ శంకర్ పటేల్ ప్రారంభించారు. గేదె, ఆవులు, మేకలు, గొర్రెలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా శంకర్ పటేల్ మాట్లాడుతూ..పాడి రైతులు పశు వైద్యుల సలహాలు పాటించాలన్నారు. రైతులు వ్యవసాయంతో పాటు పశువులను పెంచుకోవడం వల్ల అదనపు ఆదాయం వస్తుందని, పేడను సేంద్రియ ఎరువుగా పంటల పొలాలకు వాడుకోవచ్చని తెలిపారు. ఏడీఏ భాస్కరన్, మాజీ సర్పంచ్ జీవన్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

రాజంపేట: కొండాపూర్‌లో తెలంగాణ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ సహకారంతో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువైద్యాధికారి అనిల్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులు అందరూ ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆవులు గేదెలు ఏవైనా కట్టనిచో వాటిని పరీక్షించి గర్భకోశ వ్యాధులకు తగిన చికిత్స అందిస్తామన్నారు. లింగ నిర్ధారిత వీర్యం గురించి జిల్లా పశు వైద్యాధికారి సంజయ్ కుమార్ అవగాహన కల్పించారు. ఈ లింగ నిర్ధారిత వీర్యం వాడడం వలన 90 శాతం ఆడదూడలు జన్మిస్తాయని తెలిపారు. దీనికిగాను రైతు వాటా కింద రూ.250 చెల్లించాలని తెలిపారు. ఈవో డీఎల్‌డీఏ అబ్దుల్ మాజీద్ , పశువైద్యాధికారులు రవి కిరణ్, రమేష్, డీఎల్‌డీఏ సూపర్వైజర్ కృష్ణ, తదితరులున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



సదాశివనగర్ మోడల్ స్కూల్‌లో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ధర్మారావ్‌పేట్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 36 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో నలుగురికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. అధికారి బాలకిషన్ రావు, వైద్యుడు మారుతి బాబు, ప్రిన్సిపాల్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

రాజంపేట: ఆరెపల్లి గ్రామంలో రాజంపేట్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు వైద్యాధికారి విజయ మహాలక్ష్మి తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు తెలిపారు. 74 మందిని పరీక్షించి 27 మందికి బ్లడ్ శాంపుల్ తీసుకున్నట్లు పేర్కొన్నారు. డాక్టర్ సంగీత, ల్యాబ్ టెక్నీషియన్ సంతోష్, సూపర్‌వైజర్ మహ్మద్ మంజూర్, గంగామణి, ఏఎన్ఎం చంద్రకళ, రజిత, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



ఆరెపల్లిలో వైద్య శిబిరం

ఎల్లారెడ్డిలో ఫిజియోథెరపి శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఫిజియోథెరపిస్ట్

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని భవిత కార్యాలయంలో బుధవారం ఫిజియోథెరపి శిబిరం నిర్వహించారు. దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపి వైద్యులు అరుణ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి ఫిజియోథెరపీకి సంబంధించిన వ్యాయామాలు చేయించారు. సిబ్బంది వెంకటేశం తదితరులున్నారు.

ఆస్పత్రి తనిఖీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎర్రాపహాడ్ పీహెచ్‌సీని బుధవారం ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఎంత మంది రోగులు ఉన్నారు.. అన్ని రోగాలకు సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయా లేవా అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలన్నారు. లేకుంటే శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు.

నిత్యాన్నదానం కోసం విరాళం



బాన్సువాడ : బాన్సువాడ అయ్యప్ప ఆలయంలో కొనసాగుతున్న నిత్యాన్నదానం కోసం పట్టణానికి చెందిన వ్యాపార వేత్త ఉప్పరి లక్ష్మి–కాశీనాథ్ దంపతులు రూ. 25 వేల 116లను విరాళంగా ట్రస్ట్ సభ్యులు శంకర్ గురుస్వామికి అందజేశారు. ఉప్పరి సాయిలు–విఠమ్మల జ్ఞాపకార్థం నిత్య అన్నదానం కోసం విరాళం అందజేసినట్లు దాత కాశీనాథ్ తెలిపారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు వారిని సన్మానించారు.

తల్లడిల్లిన తల్లి గుండె..!

- బిడ్డ మృతదేహాన్ని పట్టుకొని విలపించిన వానరం



తన బిడ్డను లేపే ప్రయత్నం చేస్తున్న వానరం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తల్లిని మించిన దైవం లేదంటారు. తల్లిప్రేమ ఏ జీవిలోనైనా ఉన్నతంగానే ఉంటుంది. మరణించిందని తెలియక తన బిడ్డ కళేబరం వద్ద కూర్చొని ఓ వానరం దానిని లేపే ప్రయత్నం చేసింది. ఎంత లేపినా తన బిడ్డ లేవకపోవడంతో చివరికి దానిని ఎత్తుకొని చెరువుగట్టుకు వెళ్లిన ఘటన బుధవారం నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేటలో చోటుచేసుకుంది. తన బిడ్డను ఎత్తుకొని వెళ్లేందుకు ఆపసోపాలు పడుతున్న వానరాన్ని చూసిన స్థానికులు ఆవేదన చెందారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి





దండు శేఖర్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నగర మేయర్ నీతూకిరణ్ భర్త దండు శేఖర్‌ను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ బుధవారం వేర్వేరుగా పరామర్శించారు. దాడికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి వైద్యులను సూచించారు. దాడి ఘటన బాధాకరమని, దీని వెనుక ఎవరున్నా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అండర్–19 హాకీ జట్టు ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన హాకీ క్రీడాకారులు

ఆర్మూర్: జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ రవికుమార్ ఆదేశాల మేరకు పట్టణంలోని మినీ స్టేడియంలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఎస్‌జీఎఫ్ అండర్ – 19 బాలుర, బాలికల హాకీ రాష్ట్రస్థాయి జట్ల ఎంపిక పోటీలను బుధవారం నిర్వహించారు. 35 మంది బాలికలు, 40 మంది బాలురు పాల్గొనగా, ప్రతిభ ఆధారంగా 18 మందితో కూడిన తుది జట్టును ఎంపిక చేశామని జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో నల్గొండలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొంటారన్నారు. ఫిజికల్ డైరెక్టర్లు సడక్ గణేశ్, దండుగుల చిన్నయ్య, జిల్లా హాకీ అసోసియేషన్ ట్రెజరర్ పింజ సురేందర్, కత్తి శీను, గంగాధర్, సంతోష్ రెడ్డి, మీనా పాల్గొన్నారు.



ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయికి..

నిజామాబాద్‌నాగారం: ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి హాకీ టోర్నీకి జిల్లాకు చెందిన క్రీడాకారిణులు ఎంపికయ్యారు. ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలో రోథక్‌లో నిర్వహించే జాతీయ స్థాయి అండర్–17 హాకీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనున్నారు. బుధవారం జిల్లా నుంచి ఆరుగురు క్రీడాకారిణులు బయల్దేరి వెళ్లారు. జట్టుకు కోచ్‌గా రాజేశ్వర్, టీం మేనేజర్‌గా ఇందిర వ్యవహరిస్తున్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి

బాన్సువాడ : బీర్కూర్ మండలం బరంగెడ్డి గ్రామ శివారులో గైని మాదవ్వ(60) అనే వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కోటగిరి మండలం నాగేంద్రాపూర్ దేవునిగుట్ట తండాకు చెందిన మాదవ్వ మృతదేహం బరంగెడ్డి గ్రామ శివారులోని మత్తడి కాలువలో అనుమానాస్పద స్థితిలో కనిపించడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మురికికాలువలో పడి ఒకరు..



ఖలీల్ వాడి: నగరంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మురికి కాలువల పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై గంగాధర్ బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని సీతారాంనగర్ కాలనీకి చెందిన కామ్రే కపిల్ (38) కూలీ పనులు చేస్తూ జీవించేవాడు. మంగళవారం రాత్రి వర్ని చౌరస్తా లోని కల్లుబట్టీ వద్ద మద్యం సేవించిన తర్వాత పక్కనే ఉన్న మురికి కాలువలో మూత్ర విసర్జనకు వెళ్లి అందులోపడి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి ..



ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని జేబీ స్పోర్ట్ షాప్ ఎదుట గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. మృతుడి వయస్సు 45 నుంచి 50 ఏళ్లు ఉంటాయని, బ్లూ కలర్ టీ షర్టు చాక్లెట్ కలర్ నైట్ ప్యాంట్ ఉన్నట్లు తెలిపారు. మృతుడిని మేస్త్రి పని చేసే వ్యక్తిగా అనుమానిస్తున్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో లేదా 87126 59714 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కంచర్లలో మహిళ దారుణహత్య

- మెడలో నుంచి బంగారు పుస్తెలతాడు అపహరణ

భిక్కనూరు: కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం కంచర్ల గ్రామంలో దుండగులు ఓ మహిళను హత మార్చి ఆమె మెడలోని బంగారు పుస్తెల తాడును ఎత్తుకెళ్లారు. బుధవారం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. కంచర్ల గ్రామనికి చెందిన బాలెముల (టీకోటి) సుగుణ(55) తన భర్త సిద్ధరాములుతో కలిసి వ్యవసాయ క్షేత్రం వద్దకు వెళ్లింది. కంచర్ల – ఇస్సానగర్ వెళ్లే దారిలో రోడ్డు పక్కనే ఉన్న వీరి భూమిలోని వరి కొయ్యలను సుగుణ ఏరి వేస్తుండగా, ఆమె భర్త సిద్ధరాములు కొద్ది దూరంలో వ్యవసాయ పనులు చేస్తున్నాడు. దుండగులు సుగుణపై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందింది. వెంటనే ఆమె మెడలోని మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడును ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావు, భిక్కనూరు సీఐ సంపత్ కుమార్, ఎస్సై సాయికుమార్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలికి భర్తతోపాటు కుమారుడు రాజు, కుమార్తెలు శారద, శ్యామలు ఉన్నారు.

ఏజెన్సీ నిర్వాహకులకు షోకాజ్ నోటీసు

బీబీపేట: మండల కేంద్రంలోని టీఎస్ఎన్ఆర్ బాలుర ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు బుధవారం షోకాజ్ నోటీసు జారీ అయ్యింది. గత కొద్ది రోజులుగా మధ్యాహ్న భోజన సిబ్బంది వంట సరిగ్గా చేయడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్న నేపథ్యంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎంఈవో అశోక్, ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకుని నోటీసు జారీ చేశారు. రెండు రోజుల్లో ఏజెన్సీ నిర్వాహకులు సంజాయిషీ ఇవ్వాలని సూచించారు.

ఈవోపై పోలీసులకు ఫిర్యాదు

భిక్కనూరు: సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకుంటే సమాచారం ఇవ్వలేమని లిఖిత పూర్వకంగా రాసిచ్చిన భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయం ఈవో శ్రీధర్‌పై ఆర్టీఐ ప్రతినిధి గంగళ్ల రవి బుధవారం ఎస్సై సాయికుమార్‌కు ఫిర్యాదు చేశారు. సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్న వారికి 30 రోజుల్లో సమాచారం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ.. తాము సమాచారం ఇవ్వలేమని లిఖిత పూర్వకంగా రాసిచ్చిన ఈవోపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో కోరారు. ఆయనవెంట నాయకుడు కర్రోల రాజు ఉన్నారు.

రెండు గ్రామాల్లో ధాన్యం బస్తాలు చోరీ

మోపాల్: మండలంలోని బాడ్సిలో రైతు లింబాద్రి సుభాష్‌కు చెందిన 8 క్వింటాళ్ల ధాన్యం బస్తాలు చోరీకి గురయ్యాయి. బోర్గాం(పి) గ్రామానికి చెందిన సదరు రైతు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై యాదగిరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సుభాష్‌కు బాడ్సి శివారులో వ్యవసాయ భూమి ఉండగా, ధాన్యాన్ని రెండురోజుల క్రితం తూకం వేసి ఉంచాడు. అందులో నుంచి సుమారు 20 బస్తాల ధాన్యాన్ని మంగళవారం రాత్రి దుండగులు ఎత్తుకెళ్లారు. బుధవారం వెళ్లి చూడగా, ధాన్యం బస్తాలు తక్కువగా కన్పించడంతో సుభాష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాడెంలో..

మండలంలోని తాడెం గ్రామ రైతు వేల్పూర్ సాయిలుకు చెందిన 20 ధాన్యం బస్తాలను దుండగులు ఎత్తుకెళ్లారు. 36 బస్తాల ధాన్యం తూకం వేసి టార్పాలిన్ కప్పి ఉంచానని, బుధవారం వచ్చి చూడగా 20 బస్తాలు లేవని బాధితుడు వాపోయాడు. తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ధాన్యం బస్తా అమ్ముకున్న లారీ డ్రైవర్



వడ్ల బస్తాతో పట్టుబడిన లారీ డ్రైవర్

లింగంపేట(ఎల్లారెడ్డి): పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి రైస్ మిల్లుకు తరలిస్తున్న లోడ్‌లో నుంచి ధాన్యం బస్తాను మార్గమధ్యంలో లారీ డ్రైవర్ ఓ వ్యాపారికి విక్రయిస్తుండగా స్థానికులు పట్టుకొని లింగంపేట విండో సీఈవోకు అప్పగించారు. ఈ ఘటన లింగంపేటలో బుధవారం చోటు చేసుకుంది. భవానీపేట కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం బస్తాలను గాంధారి మండలంలోని వాసవి రైస్ మిల్లుకు తరలిస్తున్న లారీ డ్రైవర్ మోహన్.. లింగంపేటకు చేరుకోగానే మండల కేంద్రంలోని వడ్ల వ్యాపారి తాటిపాముల విజయ్‌కుమార్‌కు ఒక బస్తా విక్రయిస్తుండగా స్థానికులు పట్టుకున్నారు. మొదట ఫిర్యాదు చేయగా సీఈవో సైతం పట్టించుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు స్పందించి ఈ ఘటనపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

గుండెపోటుతో విద్యార్థిని మృతి

- మూడునెలల వ్యవధిలో అనారోగ్యంతో తండ్రీకూతురు..



శిరీష(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని గోపాల్‌పేటకు చెందిన ఎరుకల శిరీష మంగళవారం గుండెపోటుతో మృతి చెందింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న శిరీష ఐదు రోజుల క్రితం అనారోగ్యం బారినపడడంతో కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మంగళవారం రాత్రి గుండెపోటురావడంతో ఆమె మృతి చెందింది. శిరీష తండ్రి నారాయణ సెప్టెంబర్‌లో అనారోగ్యంతో మృతి చెందాడు. మూడు నెలల వ్యవధిలోనే తండ్రీకూతురు అనారోగ్యంబారినపడి మృతిచెందడం ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. కాగా తమ ఇంటి చుట్టూ మురికినీరు పేరుకుపోవడంతోపాటు పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి దోమలబెడద ఎక్కువగా ఉందని, అందువల్లే తమ కుటుంబంలోని ఇద్దరు అనారోగ్యానికి గురై మరణించారని నారాయణ భార్య మంజుల, పెద్ద కూతురు కవిత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తమ ఇంటి చుట్టూ పేరుకుపోయిన మురికినీటిని తొలగింపజేయడంతోపాటు పరిసరాలను శుభ్రం చేయించాలని వారు వేడుకుంటున్నారు.